క్లుప్తంగా

రూ.25కే జాతీయ పతాకం



గణపవరం పోస్టాఫీసు వద్ద జాతీయ పతాకాలను విక్రయిస్తున్న సిబ్బంది

గణపవరం: హర్‌ఘర్ తిరంగా 2.0లో భాగంగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గణపవరం పోస్టాఫీసు, దీని పరిధిలోని 12 బ్రాంచి పోస్టాఫీసుల్లో రూ.25కే జాతీయ పతాకాలను విక్రయిస్తున్నట్టు పోస్టుమాస్టర్ పితాని శివ తెలిపారు. 30 అంగుళాల పొడవు, 20 అంగుళాల వెడల్పు ఉన్న జాతీయ జెండా ధర బయట మార్కెట్ కన్నా 50 శాతం తక్కువగా ఉంటుందని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తులా శ్రీను, పీఏ రవికుమార్, జి.రాంబాబు, యోహాన్, బాలవెంకటేశ్వరరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్‌లో ఇంటింటికీ తాగునీరు



కేశవరంలో జలజీవన్ మిషన్‌పై ప్రదర్శన చేస్తున్న పంచాయతీ సిబ్బంది

గణపవరం: జలజీవన్ మిషన్ కార్యక్రమంలో ప్రతి ఇంటికీ ఒక కుళాయి, ప్రతి మనిషికీ రోజుకు 55 లీటర్ల మంచినీరు అందించడమే లక్ష్యమని జలజీవన్ మిషన్ టీమ్ లీడర్ బి.చైతన్యప్రదీప్ అన్నారు. గురువారం గణపవరం మండలం కేశవరం గ్రామంలో పంచాయతీ సభ్యులతో కలిసి జలజీవన్ మిషన్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. విలేజ్ వాటర్ శాంక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ మిడతాని కామేశ్వరి, పంచాయతీ కార్యదర్శి జి.బాలకృష్ణ, పంచాయతీ సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

కళాశాలకు విగ్రహాల అందజేత



విగ్రహాన్ని అందజేస్తున్న పూర్వవిద్యార్థి శ్రీనివాసరావు

ఉంగుటూరు: నారాయణపురం అరవిందశత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ సందర్భంగా అరవిందుడు, పొట్టి శ్రీరాములు, గాంధీ విగ్రహాలను పూర్వ విద్యార్థి, ఆర్యవైశ్య సంఘం నాయకుడు కోనా శ్రీనివాసరావు గురువారం అధ్యాపకుడు కొండా రవికి అందజేశారు. ఈ విగ్రహాలను ఈనెల 13న ఆవిష్కరించనున్నారు. శ్రీనివాసరావును పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి బొమ్మిడి అప్పారావు, అధ్యక్షుడు ఈపూరి సత్యనారాయణ అభినందించారు.

వైఎస్సార్‌సీపీలోకి పలువురి చేరిక



చొదిమెళ్ల రవిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: సోమవరప్పాడు గ్రామానికి చెందిన టీడీపీ నేత చొదిమెళ్ల రవి గురువారం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవరప్పాడులో రవిని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కండువాను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధి, బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, పెదవేగి ఎంపీపీ తాతా రమ్య రవిని అభినందించారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు పురస్కారాలను అందిస్తున్న దృశ్యం

భీమడోలు: ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తే వారు ఉన్నత స్థితికి చేరుకుంటారని వక్తలు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూలులో పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు గురువారం ప్రతిభా పురస్కారాలను అందజేశారు. కఠారి కోరుకొండ నాగేశ్వర నరసింహమూర్తి (కోరు మాస్టార్) స్మృత్యర్థం ఆయన కుమారులు పుణ్యమూర్తి, సుబ్రహ్మణ్యం వాటిని అందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన కె.రితిక, ఎల్.వినూత్న, వెజ్జు పవన్‌లకు రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు చొప్పున నగదు, షీల్డ్‌లను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం



భీమడోలులో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగిస్తున్న ఎంపీడీఓ



గణపవరంలో విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యసిబ్బంది



దెందులూరు పాఠశాలలో మాత్రలు వేస్తున్న ఎంఈఓ ప్రసాద్

భీమడోలు: నులిపురుగుల నివారణ ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన సాధ్యమని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతి దేవి అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమడోలు మండలం గుండుగొలను, పూళ్ల పీహెచ్‌సీల పరిధిలో ఆల్బెండజోల్ మాత్రలను చిన్నారులతో మింగించారు. ప్రభుత్వ, ప్రైవేటు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, బాలబాలికలు, యువతీ యువకులకు మాత్రలను పంపిణీ చేశారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ పద్మావతి, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఎంఈఓ ఈ.శ్రీనివాసరావులు పాల్గొని మాట్లాడారు. ఏటా రెండు సార్లు పిల్లల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. తద్వారా పోషకాహార లోపం నివారణ, రక్త హీనతలను నివారించుకోవచ్చని, సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని తెలిపారు. వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మి మాట్లాడుతూ గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలోని 19 ఏళ్లలోపు విద్యార్థులు, యువతీ యువకులు 11,106 మంది ఉండగా 10,237 మందితో మాత్రలను మింగించామన్నారు. మిగిలిన వారికి ఈనెల 17న మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. పూళ్ల వైద్యాధికారులు బి.లీలా ప్రసాద్, కె.కల్యాణిని మహేశ్వరిలు మాట్లాడుతూ పూళ్ల పీహెచ్‌సీ పరిధిలో 29 ప్రభుత్వ పాఠశాల్లో 3306 మందిలో 3316 మందికి మాత్రలు పంచామని చెప్పారు. 33 అంగన్‌వాడీ కేంద్రాల్లో 963 మంది చిన్నారుల్లో 904 మందితో మాత్రలను మింగించామన్నారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, సిబ్బంది ఎస్‌కే నవీన్, రామకృష్ణ, ఆరోగ్య సిబ్బంది టి.మురళి, ఎం.శ్రీనివాసరావు, చంద్రకళ, కనకరత్నం, ఎంఎల్‌హెచ్‌పీ నకిత పాల్గొన్నారు.



పెదవేగిలో చిన్నారులకు నులిపురుగుల మాత్రలు వేయిస్తున్న సీడీపీఓ

నులిపురుగులతో అనారోగ్యం

గణపవరం: నులిపురుగులతో ఎన్నో అనర్థాలున్నాయని, ముఖ్యంగా విద్యార్థుల్లో రక్తహీనత, నీరసం, చదువులో వెనుకబాటు తనం వస్తాయని గణపవరం, పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారులు సంతోష్ కిరణ్మయి, దివ్య, ప్రియాంక అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గణపవరం మండలం గణపవరం, పిప్పర పీహెచ్‌సీల పరిధి పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వాటిని విద్యార్థులతో మింగించారు. మిగిలిన విద్యార్థులకు ఈనెల 17న మరోసారి మాత్రలు అందజేస్తామన్నారు. మండలంలో సుమారు 6 వేల మందికి మాత్రలు పంపిణీ చేసినట్టు చెప్పారు.

దెందులూరులో..

దెందులూరు: నులిపురుగుల నివారణకు ఏడాదికి రెండుసార్లు విద్యార్థులందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం దెందులూరు ప్రాథమిక పాఠశాలలో 42 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీచేశారు. ఆరోగ్యసూత్రాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హెచ్‌ఎం వెంకటలక్ష్మి, ఏఎన్‌ఎం శ్రీలక్ష్మి విద్యార్థులకు వివరించారు.

మెరుగైన సేవలు అందించాలి

పెదవేగి: అంగన్‌వాడీ కేంద్రాల్లో మరింత మెరుగైన సేవలు అందించాలని పెదపాడు అదనపు సీడీపీఓ ఎంఎస్ రాజశేఖర్ అన్నారు. పెదవేగి, రాట్నాలకుంట, రామన్నపాలెం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. లబ్ధిదారులకు అందుతున్న సేవలు, పోషకాహార సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఎత్తు, బరువులను రికార్డుల ఆధారంగా సరిచూశారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని రాజశేఖర్ అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో పోషకాహార సరుకులు అందిస్తూ మాతా, శిశు సంరక్షణకు చర్యలు చేపట్టిందని చెప్పారు. పెదవేగి సెకారు సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన

పెదపాడు : రూ.55 కోట్ల వ్యయంతో చేపట్టిన ఏలూరు – పెరికీడు రహదారి నిర్మాణ పనులను గురువారం రహదారులు భవనాల శాఖ ఎస్ఈ జి.జాన్‌మోషే, ఈఈ వైవీ కిశోర్ బాపూజీ పరిశీలించారు. పలు సూచనలు సలహాలను అందించారు. నిర్మాణంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలాలు



భీమడోలులో వికసించిన బ్రహ్మకమలాలు

భీమడోలు: స్థానిక బాదర్వాడ కృష్ణ మోహనరాజు పెరట్లో బ్రహ్మ కమల పుష్పాలు వికసించి చూపరులను కనువిందు చేశాయి. ఒక మొక్కకు బుధవారం అర్ధరాత్రి ఒంటి గంటకు ఒకేసారి ఏడు పుష్పాలు వికసించాయి. సాధారణంగా వేసవిలో బ్రహ్మకమలాలు వికసిస్తాయి. మూడు నెలల ఆలస్యంగా పుష్పించాయని ఇంటి యాజమాని తెలిపారు. ఈ మొక్కను కింగ్ ఆఫ్ హిమాలయన్ ఫ్లవర్‌గా పిలుస్తారు. ఈ మొక్కపై ఆకులే పువ్వుగా రూపాంతరం చెందుతాయి. చెట్టు నుంచి ఒకేసారి ఏడు పువ్వులు వికసించడం అరుదుగా ఉండడంతో చూపరులు ఆసక్తిగా తిలకించారు.

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యం



గణపవరం హైస్కూల్లో చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు తరచూ చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు సంతోష్, కిరణ్మయి అన్నారు. చేతుల పరిశుభ్రత అంటువ్యాధుల వ్యాప్తిపై గురువారం స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, మలవిసర్జన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. చేతులు, గోళ్ల ద్వారా కంటికి కనిపించని సూక్ష్మ క్రిములు శరీరంలోకి ప్రవేశించి, అనారోగ్యం బారిన పడతామని చెప్పారు. ఆరోగ్యకరమైన అలవాట్లు నేర్చుకోవాలని సూచించారు. చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జాలాది విల్సన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



మొండూరులో మౌనికకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: మేధినరావుపాలెంలోని మొండూరు గ్రామానికి చెందిన డయాలసిస్ చికిత్స పొందుతున్న చిన్నారి బొంత దుర్గా మౌనికరే వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1 లక్ష సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గురువారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అందజేశారు. మౌనిక తల్లి వెంకటలక్ష్మి తన కిడ్నీని కుమార్తెకు దానం చేసేందుకు అంగీకరించింది. దుర్గా మౌనిక పరిస్థితిని ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు ఎమ్మెల్యే చెప్పారు. వెంటనే స్పందించిన సీఎం రూ.లక్ష విడుదల చేశారని, ఈ మేరకు చెక్కును దుర్గా మౌనికకు, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో అందజేశామన్నారు. తల్లి వెంకటలక్ష్మి ప్రేమను గ్రామస్తులు, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అభినందించారు.

నా భూమి, నా దేశం స్తూపాల ఆవిష్కరణ



పెదవేగిలో నా భూమి, నా దేశం స్తూపాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



నా భూమి, నా దేశం స్తూపాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వాసుబాబు

దెందులూరు: పెదవేగిలో ఏర్పాటుచేసిన నా భూమి, నా దేశం స్తూపాన్ని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి గురువారం ఆవిష్కరించారు. ఎంపీపీ తాతా రమ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొక్కలు నాటారు. దెందులూరు నియోజకవర్గ పరిశీలకులు యడ్ల తాతాజీ, రాట్నాలమ్మ తల్లి ఆలయ చైర్మన్ చల్లగోళ్ళ వెంకటేశ్వరరావు, ఏపీ కార్పొరేషన్ డైరెక్టర్ మండలి కొండలరావు, జెడ్పీ వైస్ చైర్మన్ పి.విజయ్‌బాబు, ఎంపీడీఓ గంజి రాజ్ మనోజ్, సొసైటీ చైర్మన్ పెనుమాల సుబ్బారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు ఉన్నారు.

రావులపర్రులో..

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం రావులపర్రు గ్రామంలో ఏర్పాటుచేసిన నా భూమి, నా దేశం స్థూపాన్ని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆవిష్కరించారు. అమరవీరుల త్యాగాలను గుర్తిచేసుకున్నారు. తౌలుత గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు.

అమరవీరుల స్మరణకే నా భూమి, నాదేశం

పెదపాడు: దేశ స్వాతంత్ర్యం కోసం అశువులు బాసిన వీరుల స్మరించేందుకే ప్రభుత్వం నా భూమి, నాదేశం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డీపీఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు. పెదపాడు మండలం కలపర్రు గ్రామంలో నా భూమి నాదేశం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో నాయకులు జైలు జీవితాన్ని గడిపారని గుర్తుచేశారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారని వివరించారు. ఈ సందర్భంగా డీపీఓ మాజీ సైనికాధికారి కావడంతో ఆయన్ను మండలంలోని అధికారులు, గ్రామ సర్పంచ్ వట్రపు విష్ణుతులసి ఘనంగా సన్మానించారు. అనంతరం మొక్కలు నాటారు. పంచాయతీ కార్యాలయం వద్ద నా భూమి, నా దేశం దిమ్మెను నిర్మించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ నిర్మలజ్యోతి, ఏఓ వానపల్లి ప్రదీప్‌కుమార్, ఎంఈఓ–2 దేవినేని వెంకట రమణ, ఏఈలు శ్రీనివాస్, చైతన్య పాల్గొన్నారు.

వారి త్యాగాలు మరవలేనివి

భీమడోలు: అమరవీరుల త్యాగాలు మరవలేనివని వక్తలు అన్నారు. రెండో రోజు గురువారం నా భూమి నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం ఆట్టహాసంగా నిర్వహించారు. భీమడోలు పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్తూపాన్ని సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్ ప్రారంభించారు. పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. సెల్ఫీలు దిగారు. ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి మాట్లాడారు. చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పి.మాన్‌సింగ్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీడీఓ కార్యాలయ అధికారి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

పెదపాడు : స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నాభూమి, నాదేశం కార్యక్రమంలో భాగంగా కలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఎండీ కె.సాయిరోహిత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మొక్కల పెంపకం వల్ల కలిగే లాభాలు వివరించారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కె.మధుబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ మొక్కల అందజేత

ఉంగుటూరు: ఆయిల్‌పామ్ సాగు లాభదాయకమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం గొల్లగూడెం గ్రామంలో మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌ను ఎమ్మెల్యే వాసుబాబు ప్రారంభించి మాట్లాడారు. గోద్రెజ్ సంస్థ భాగస్వామ్యంతో రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలను అందజేశారు. ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శాంతి, గోద్రెజ్ సీఈఓ ఎస్ నియోగి మాట్లాడారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

గణపవరం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం ఉద్యమాలు చేస్తూ వారికి యూటీఎఫ్ అండగా నిలుస్తోందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి హోతా ఆంజనేయులు పేర్కొన్నారు. గురువారం గణపవరం మండలం పిప్పరలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. నాయకులు రమేష్, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం



రామశింగవరంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



రావులపర్రులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుప్పాలవాసుబాబు

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం రామశింగవరంలో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్యలతో కలిసి అబ్బయ్యచౌదరి ప్రతి గడపకూ వెళ్లి జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి, చేస్తోన్న అభివృద్ధి గురించి వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారుంటే, ఆ వివరాలు సేకరించి పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులు, సచివాలయ సిబ్బందికి సూచించారు. తౌలుత గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంగానమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. రాచపల్లి గంగాధరరావు, పసుమర్తి మహేంద్ర, సీతాల దాసు, అద్దేపల్లి రాంబాబు, రాచపల్లి రాంబాబు, చింతపల్లి నాగరాజు, వెన్నవెల్లి రవి, గోపిశెట్టి శ్రీను, గోపిశెట్టి రాజు, రాట్నాలమ్మ దేవస్థాన చైర్మన్ చళ్లగొళ్ల వెంకటేశ్వరరావు, కామిరెడ్డి నాని, గోపిశెట్టి రాధమ్మ, జిల్లా నాగరాజు, బైపా ఆదాం, కంటిపూడి ధర్మరాజులు, ఆళ్ల బాబి, యలమర్తి జయరాజు, జిల్లా వెంకటేష్, జమ్మిశెట్టి ఆంజనేయులు, సిదర్ల వరబాబు, చిలుకూరి సుబ్బారావు పాల్గొన్నారు.

హామీల అమలు ఘనత వైఎస్సార్‌సీపీదే

ఉంగుటూరు: హామీలను నూరుశాతం అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం ఉంగుటూరు మండలం రావులపర్రులో ఆయన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుని మడం తిప్పని నేతగా సీఎం జగన్ పేరు తెచ్చుకున్నారని చెప్పారు. విద్యారంగానికి పెద్ద పీట వేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికీ ఏదో ఒక లబ్ధి చేకూరిందని చెప్పారు. ఎమ్మెల్యేకు రావులపర్రులో తొలుత ఘనస్వాగతం లభించింది. నా భూమి నాదేశం సూచిస్తూ ఏర్పాటచేసిన స్థూపాన్ని వాసుబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ మరడ మంగరావు, మహిళా అధ్యక్షురాలు మంద జయలక్ష్మి, సర్పంచ్ పైడి వెంకటరమణ, రంగరావు, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, నాయకులు పుప్పాల గోపి, పెనుగొండ బాలకృష్ణ, గంటా లక్ష్మణరావు, గాది వెంకటరమణ, మూల కళ్యాణి, ముత్యాలరావు, బోడి గద్ద శివ, తాడిశెట్టి రాజకుమార్, బోనాద్రి తాతారావు, విద్యుత్ ఏఈ శ్రీరామ్, పంచాయతీ కార్యదర్శి వి.శ్రీదేవి పాల్గొన్నారు.

వార్డులు ఆరు.. నామినేషన్లు ఎనిమిది

పాతముప్పర్రు మినహా వార్డులకు పోటీ లేదు



అప్పనవీడులో నామినేషన్ దాఖలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు

పెదపాడు : మండలంలోని వీరమ్మకుంట సర్పంచ్ ఉప ఎన్నికలకు గురువారం 9 నామినేషన్లు దాఖలు కాగా 6 వార్డులకు 8 నామినేషన్లు దాఖలయ్యాయి. సర్పంచ్ ఉపఎన్నికకు వైఎస్సార్‌సీపీ నుంచి నలుగురు, టీడీపీ నుంచి ఐదుగురు నామినేషన్ దాఖలు చేశారు. పెదపాడు మండలంలో ఖాళీ అయిన ఆరు వార్డుల్లో 5 వార్డులో పోటీ లేదు. పెదపాడు 8వ వార్డుకు ఒక నామినేషన్, రాజుపేటలోని 1, 4 వార్డులకు ఒక్కొక్కటి, అప్పనవీడు 7వ వార్డుకు రెండు, పాతముప్పర్రు 10వ వార్డుకు బురద సోమేశ్వరి, ముదురుమాక అన్నమ్మలు నామినేషన్లు వేశారు. వసంతవాడ 9వ వార్డుకు ఒకటి, అప్పనవీడు 7వ వార్డు ఎస్సీలకు కేటాయించడంతో బట్టు స్వరూపరాణి, ప్రత్తిపాటి కరుణ కుమారి నామినేషన్ దాఖలు చేశారు. వీరిద్దర్నీ వైఎస్సార్‌సీపీ బలపర్చడంతో ఎన్నిక ఏకగ్రీవం కానుంది. కార్యక్రమంలో దెందులూరు ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్, సర్పంచ్ చిన్నాల ఝాన్సీ పాల్గొన్నారు. పెదపాడులో వైఎస్సార్‌సీపీ బలపరిచిన గిన్నిపల్లి సోమేశ్వరమ్మ, రాజపేటలో 1వ వార్డుకు తలారి వనజ, 4వ వార్డుకు వడ్లమూడి మరియమ్మ, వసంతవాడ 9వ వార్డుకు చింతల ఆనంద్ నామినేషన్ దాఖలు చేశారు. 4 వార్డులకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది.

వార్డులు మూడు.. నామినేషన్లు ఎనిమిది

ఉంగుటూరు: ఉంగుటూరు, కాకర్లమూడి వార్డులకు ఎన్నికల కోలాహలం మొదలైంది. వార్డు సభ్యుల నామినేషన్లు గడువు గురువారం ముగిసింది. ఉంగుటూరు 10వ వార్డుకి కాళ్ల నాగలక్ష్మి, తుంగ అనూష, మారిశెట్టి సరస్వతి, ముప్పన రాధిక, కాకర్లమూడి 1వ వార్డుకి రాజాని వరలక్ష్మి, రాయి నాగమణి, 5వ వార్డుకి గోడె రాజు, తోట దివాకర్‌లు నామినేషన్లు వేశారు. కాగా 14న విత్‌డ్రాలకు అవకాశం ఉంది. ఆయా గ్రామ పంచాయతీ సెక్రటరీలు సహకరిస్తుండగా, కాకర్లమూడి ఎన్నికల అధికారిగా కె.ప్రవీణ్‌కుమార్, ఉంగుటూరు ఎన్నికల అధికారిగా సుబ్రహ్మణ్యం పనిచేస్తున్నారు.

వార్డు మెంబర్లుకు 15 నామినేషన్లు

దెందులూరు: మండలంలో వార్డు మెంబర్ల ఎన్నికలకు 15 నామినేషన్లు గురువారం దాఖలయ్యాయి. కొత్తగూడెం గ్రామంలో 5వ వార్డుకు ఐదు, 11వ వార్డుకు నాలుగు నామినేషన్లు దాఖలు చేశారు. కొవ్వలిలో 11వ వార్డుకు రెండు, గోపన్నపాలెంలో 11వ వార్డుకు నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి.

నామినేషన్ల ఘట్టం పూర్తి

భీమడోలు: పోలసానిపల్లిలోని 12వ వార్డు ఉప ఎన్నికకు గురువారం సాయంత్రంతో నామినేషన్ల ఘట్టం ముగిసింది. మొత్తం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయని స్టేజ్ వన్ అధికారిణి జీవన సంధ్య తెలిపారు. ఈనెల 11న నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎన్.తాగూర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

గణపవరం: గణపవరం – పిప్పర – తాడేపల్లిగూడెం రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. తాడేపల్లిగూడెంకు చెందిన గుర్రం ఉదయ్‌కిరణ్, అతని స్నేహితుడితో కలిసి మోటార్ సైకిల్‌పై పిప్పర వచ్చి, తిరిగి తాడేపల్లిగూడెం వెళ్తుండగా జల్లికొమ్మర తూము వద్ద పిప్పరవైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో గాయపడ్డ ఇద్దర్నీ 108 వాహనంలో తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉదయకిరణ్ చేతివేళ్లు విరిగాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై వి.వెంకటేశ్వరావు తెలిపారు.